క్లుప్తంగా

అథ్లెటిక్స్‌కు ఎంపిక



ఎంపికైన వారితో పీడీలు, ఉపాధ్యాయులు

మదనపల్లె సిటీ : నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్‌కు 64 మంది ఎంపికైనట్లు క్రీడల ఇన్‌చార్జ్ పీడీ దేవకమ్మ తెలిపారు. గురువారం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ట్రాక్, ఫీల్డ్ ఈవెంట్స్ జరిగాయి. అండర్-14,-17 అథ్లెటిక్స్‌కు ఎంపిక చేశారు. ఇందులో వివిధ విభాగాలలో 64 మంది ఎంపిక అయ్యారు. వీరు ఈ నెలాఖరులో తిరుపతిలో జరిగే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, పీడీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

రామసముద్రం : మండలంలోని చెంబకూరు హైస్కూల్ విద్యార్థి వి.చందు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, అండర్ -17 బాలుర విభాగంలో రాష్ట్ర స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం విష్ణుప్రియ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా టి.సదుమూరు కుప్పం మండలంలో బుధవారం జరిగిన అండర్-17 త్రోబాల్ పోటీలలో విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎన్నికైనట్లు చెప్పారు. విద్యార్థి నవంబర్ నెలలో నంద్యాలలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు.

మెడికల్ కళాశాల నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఆర్డీఓ మురళి

మదనపల్లె : స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో జరుగుతున్న తాత్కాలిక మెడికల్ కళాశాల నిర్మాణ పనులను శుక్రవారం ఆర్డీఓ ఎం.ఎస్.మురళి పరిశీలించారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి మదనపల్లె మెడికల్ కళాశాలలో తరగతులు ప్రారంభమవుతాయని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో తాత్కాలిక భవన నిర్మాణ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌ఎంఓ ప్రసాదరాజు తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే

గుర్రంకొండ : మండల సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రమణారెడ్డి మృతి పట్ల పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డిలు సంతాపం ప్రకటించారు. మండలంలోని నడిమికండ్రిగ పంచాయతీ వరపసవాండ్లపల్లెకు వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకట్రమణారెడ్డి(65) గుండెపోటుతో బుధవారం రాత్రి మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు గురువారం మృతుడి స్వగ్రామానికి చేరుకొని మృతదేహానికి నివాళులు అర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఆర్బీకే చైర్మన్ సుధీర్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్ ప్రకాష్‌రెడ్డి, నాయకులు వెంకట్రమణ, శివలు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కురబలకోట : బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పరామర్శించారు. మండలంలోని కనసానివారిపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు మూలింటి (నల్లగ్గారి) గోపాల్‌రెడ్డి (36) ఆకస్మిక మృతి పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం అతను పొలం వద్ద ఆకస్మికంగా మృతి చెందారు. గురువారం స్వగ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంతో భవిష్యత్తు ఉన్న గోపాల్‌రెడ్డి ఆకస్మికంగా మృతి చెందడం పట్ల గ్రామస్తులతోపాటు బంధుమిత్రులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు

వేతనాల సమస్య పరిష్కారానికి కృషి



ఉర్దూ అకాడమీ డైరెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న ఉద్యోగులు

వాల్మీకిపురం : రాష్ట్రంలోని ఉర్దూ అకాడమీ ఉద్యోగుల వేతనాల సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. గురువారం వాల్మీకిపురంలో జరిగిన అన్నమయ్య జిల్లా ఉర్దూ అకాడమీ ఉద్యోగుల సమావేశంలో వేతనాల సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు ఆయనకు వినతి పత్రం అందించారు. పాతికేళ్ల నుంచి పని చేస్తున్నా తమకు వేతనాలు పెంచడం లేదని తెలిపారు. స్పందించిన ఆయన మాట్లాడుతూ ఉర్దూ అకాడమీ బోర్డు సమావేశంలో ఈ విషయమై తీర్మానాన్ని ఆమోదించి చర్యలు తీసుకుంటామన్నారు. ఉర్దూ అకాడమీ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించి, లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి, వాల్మీకిపురం, పుంగనూరు, కలికిరి, గుర్రంకొండ ప్రాంతాల్లోని ఉర్దూ అకాడమీ ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా



కురబలకోట : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



తంబళ్లపల్లె: వైద్య శిబిరానికి వచ్చిన ప్రజలు

కురబలకోట : వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, 104 వాహనం, ఫ్యామిలీ డాక్టర్, జగనన్న ఆరోగ్య సురక్ష లాంటి కార్యక్రమాలతో ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అంగళ్లలో గ్రామ సర్పంచ్ పోరెడ్డి విశ్వారెడ్డి ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పెద్ద ఎత్తున జరిగింది. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడుతూ వివిధ రకాల జబ్బులతో ఎక్కడ చూసినా ఆసుపత్రులు కిటకిటలాడుతున్నాయన్నారు. ప్రస్తుత రోజుల్లో ఆరోగ్యంగా ఉండడం కూడా సంపదేనన్నారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమం అంటే ఆసుపత్రి జనం చెంతకు వచ్చినట్లేనన్నారు. ఆసుపత్రిలో లభించే వివిధ రకాల సేవలు ఇక్కడ లభిస్తాయన్నారు. సీఎం జగన్ ఒక వైపు పాలనను గడప వద్దకు తీసుకు వచ్చారని, మరో వైపు వైద్యాన్ని కూడా ప్రజల చెంతకు తీసుకు వచ్చారన్నారు. పైసా ఖర్చు లేకుండా వివిధ ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతోపాటు ఉచితంగా మందులు ఇవ్వడం పేద, మధ్య తరగతి వారికి పెద్ద ఊరటన్నారు. సీఎం జగన్ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు అండగా నిలుస్తోందన్నారు. ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. మందులు, వైద్య చికిత్సలతోపాటు ముఖ్యంగా జీవన విధానం, ఆహారంలో మార్పు ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చన్నారు. తగినంత వ్యాయామం, యోగా, ధ్యానం లాంటివి అలవర్చుకోవాలన్నారు. అప్పుడే రోగాలు తగ్గుముఖం పడతాయన్నారు. నియోజక వర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశామని, చేయాల్సింది ఇంకా ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు బైసాని చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీపీ బి.దస్తగిరి, తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు, సురేంద్రనాథ్, డిఆర్.ఉమాపతిరెడ్డి, ఎంజీ భూదేవి, కోళ్ల వాసుదేవరెడ్డి, ఫజరుల్లా, ఎంపీడీఓ దిలీప్‌కుమార్, శివశంకర్‌రెడ్డి, ఆర్సీ ఈశ్వర్‌రెడ్డి, కార్యదర్శి ఎంటీజీ ప్రసాద్, ముత్ర దామోదర్‌రెడ్డి, వైద్యాధికారులు కె.శ్రీధర్, క్రిస్టల్, యాసాన్, ముస్తాక్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

మదనపల్లె : పేదలకు మెరుగైన వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం లక్ష్యమని ఎంపీడీఓ భానుప్రసాద్ అన్నారు. మండలంలోని కొత్తపల్లె-1 గ్రామ సచివాలయ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిబిరానికి హాజరైన ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యశ్రీ పథకం, వైద్యం లభించే ఆస్పత్రి వివరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు గ్రామాల్లోనే మెరుగైన వైద్యం అందించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారన్నారు. స్పెషలిస్టు డాక్టర్లతో పేదలకు వైద్యపరీక్షలు చేయించడంతోపాటు అక్కడికక్కడే మందులు అందించేలా ఏర్పాట్లు చేశారన్నారు. అనంతరం 335 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందించారు. ఐసీడీయస్ మదనపల్లె ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శిబిరంలో నిర్వహించిన పోషకాహారాల ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌ల పంపిణీతోపాటు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ మహేష్‌బాబు, సీడీపీఓ సుజాత, సూపర్‌వైజర్ చంద్రకాంతమ్మ, పీఎస్.షర్ఫుద్దిన్, జేసీఎస్ కన్వీనర్ నాగార్జున, వాసు, భువనేశ్వరి, డాక్టర్లు ఫర్హన్‌ఖాన్, ఝాన్సీలక్ష్మి, రామాంజులనాయక్, వెంకటేశ్వరరెడ్డి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బాధితుల చెంతకే సేవలు

తంబళ్లపల్లె: అనారోగ్యంతో బాధ పడుతున్న బాధితుల చెంతకే వైద్యులు వచ్చి సేవలు అందిస్తున్నారని మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ నారాయణరెడ్డి తెలిపారు. తంబళ్లపల్లె ఉన్నత పాఠశాల ఆవరణలో పరషతోపు పంచాయితీ సర్పంచు పార్వతమ్మ, ఎంపీటీసీ సభ్యులు సరోజమ్మ, కరీమ్‌ల ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్లు అనుపమ, మునికుమార్, నజ్మాలు పలు రకాల పరీక్షలతో వైద్య చికిత్సలు చేశారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సురేంద్రనాథ్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈవో నాగ సుబ్బరాయుడు, నాయకులు రామూర్తి, శ్రీనివాసులు, నరసింహులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అందరికీ సంపూర్ణ ఆరోగ్యం

బి.కొత్తకోట : అందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించడమే ప్రభుత్వ ఆశయమని ఎంపీడీఓ శంకరయ్య అన్నారు. మండలంలోని బీరంగిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ ద్వారా ప్రభుత్వం వేలాది మంది ప్రాణాలను సంజీవనిలా కాపాడుతోందన్నారు. ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల వద్దకే వెళ్లి ఆరోగ్య పరీక్షలు, మందులను అందిస్తున్నట్టు చెప్పారు. హాజరైన ప్రజలకు వైద్యులు శంకర, కృష్ణ, గీత, ఆస్మా, స్టీఫెన్ రిచర్డ్ వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మినరసమ్మ, జెడ్పీటీసీ రామచంద్ర, సర్పంచులు వెంకటరమణ, గిరిజ, ఉపసర్పంచు వెంకటప్ప, ఎంపీటీసీ యల్లప్ప, కోఆప్షన్ ఎస్.నాసీర్‌వలీ, ప్రత్యేక ఆహ్వానితులు అరుణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పెద్దమండ్యం : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీధర్‌రావు అన్నారు. మండలంలోని ముసలికుంట ప్రాథమికోన్నత పాఠశాల వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపు నిర్వహించారు. శిబిరానికి వచ్చే ప్రజలు, రోగుల కోసం కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. వారికి నలుగురు డాక్టర్‌లు చికిత్సలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ టి జయచంద్రారెడ్డి, సిహెచ్‌వో క్రిష్టయ్య, డాక్టర్‌లు హరివర్మ, ఇమ్మాన్యుల్, నజ్మా, సర్పంచ్ టి జయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు టి ప్రకాష్‌రెడ్డి, వైద్య ఆరోగ్య, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

320 మందికి వైద్య పరీక్షలు

వాల్మీకిపురం : పేదల సంపూర్ణ ఆరోగ్యమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని మాజీ జెడ్పీటీసీ సభ్యులు చింతల శివానంద రెడ్డి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 320 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు, మాత్రలు పంపిణీ చేశారు. అలాగే ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారం స్టాల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగులమ్మ, ఎంపిడివో షబ్బీర్ అహ్మద్, నాయకులు కేశవరెడ్డి, నీళ్లభాస్కర్, శ్రీధర్‌రాయల్, అబ్దుల్ కలీమ్, చికెన్ మస్తాన్, సైపుల్లా, రాజేష్, షాహెద్, రఘు, రమేష్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అనారోగ్య సమస్యలు పరిష్కరించుకోండి

రామసముద్రం : మండలంలోని కమ్మవారిపల్లెలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. వైస్ ఎంపీపీ గంగాధర్‌నాయుడు, సర్పంచ్‌లు చరణ్, నవీత, ఇంజం వెంకటరమణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీపీ కుసుమకుమారి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరు కొండూరు కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ రమణారెడ్డి, మండల కన్వీనర్ నంద రెడ్డి, ఆర్‌బికె చైర్మన్ కృష్ణమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలు అన్ని అనారోగ్య సమస్యలను పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. అనంతరం వైద్యాధికారులు డాక్టర్ లీలా, డాక్టర్ భార్గవి, నూరుల్లా, అర్జున్ రెడ్డిలు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు పంపిణీ చేశారు. ఎంపీపీ కుసుమకుమారి గర్భిణులకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నారాయణస్వామి, డీటీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి నాగమణి, సచివాలయ, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, నాయకులు పాల్గొన్నారు.

అందుబాటులో అన్ని రకాల మందులు

నిమ్మనపల్లె : వైద్య శిబిరంలో అన్ని రకాల మందులు, ఎమర్జెన్సీ కిట్‌లు అందుబాటులో ఉన్నాయని డీఎల్‌డీఓ లక్ష్మీపతి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్న తీరుపై మండల పరిషత్ సమావేశ భవనంలో మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదప్రజలకు మెరుగైన వైద్యచికిత్సలు అందించాలని రాష్ట్రప్రభుత్వం భావించి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమాన్ని పటిష్టంగా అమలుపరిచి, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి చికిత్సలు అందించేందుకు క్షేత్ర స్థాయి సచివాలయ సిబ్బంది, వలంటీర్లు చురుగ్గా పని చేయాలన్నారు. అవసరమైన రోగులకు ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషగిరిరావు, తహసీల్దార్ సీ.అర్.మంజుల, ఈఓపీఆర్డీ చలపతి రావు తదితరులు పాల్గొన్నారు.

బండ్లపై గ్రామంలో..

నిమ్మనపల్లె మండలంలోని బండ్లపై గ్రామం ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ శేషగిరిరావు, మెడికల్ ఆఫీసర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ నరసింహులు, సింగిల్‌విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రమణారెడ్డి, చంద్ర హాజరయ్యారు. వైద్యశిబిరంలో 356 మందికి చికిత్సలు అందజేశారు. మందులను పంపిణీ చేశారు. అవసరమైన వారికి మెరుగైన వైద్యచికిత్సల కోసం రెఫరల్ ఆస్పత్రులకు పంపించేందుకు ఏర్పాట్లు చేశారు. డాక్టర్లు దీక్షితారాణి, అర్షియాఅంజుమ్, రాజేశ్వరి రోగులకు సేవలందించారు.

నేడు పట్టెంవాండ్లపల్లిలో..

పెద్దతిప్పసముద్రం : మండలంలోని పట్టెంవాండ్లపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం జరుగునని ఎంపీడీవో గిరిధర్‌రెడ్డి తెలిపారు. సచివాలయ పరిధిలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



పెద్దమండ్యం : వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది



వాల్మీకిపురం : మాట్లాడుతున్న జెడ్పీటీసీ చింతల శివానందరెడ్డి



రామసముద్రం : మాట్లాడుతున్న సింగిల్ విండో చైర్మన్ కేశవరెడ్డి



మదనపల్లె : గర్భిణులకు సీమంతం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎంపీడీఓ, ఐసీడీఎస్ అధికారులు



నిమ్మనపల్లె : మాట్లాడుతున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి



నిమ్మనపల్లె: మందులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



తంబళ్లపల్లె: మందులు తీసుకుంటున్న జనం

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



మాట్లాడుతున్న ఆర్‌ఎం ప్రసాద్

వాల్మీకిపురం : ఖాతాదారులు బ్యాంకు లావాదేవీలపై అవగాహన పెంచుకుంటేనే బ్యాంకులు అభివృద్ధి చెందుతాయని సప్తగిరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ జిఎంవి ప్రసాద్ అన్నారు. గురువారం స్థానిక పునుగుపల్లిలో ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు నేరుగా వచ్చి బ్యాంకులో అందిస్తున్న లోన్లు, లావాదేవీల గురించి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, విజయ విహార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ క్రిష్ణమూర్తి, మేనేజర్ సందీప్ కుమార్‌రెడ్డి, ఉపసర్పంచ్ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక భరోసాకే స్త్రీనిధి రుణాలు

తంబళ్లపల్లె : వైఎస్సార్ క్రాంతి పథం మహిళా సభ్యులకు స్త్రీ నిధి ద్వారా రుణాలు ఇస్తున్నట్లు స్త్రీ నిధి ఏజీయం ఉదయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సంఘమిత్రలు, సీసీలతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంఘానికి అందులో ఏడుగురు సభ్యులకు రూ.4 లక్షల వరకు స్త్రీ నిధి రుణాలు ఇస్తామన్నారు. ప్రతి సభ్యురాలికి రూ.50 వేల నుండి రూ.70వేల వరకు రుణం పొందవచ్చన్నారు. తిరిగి సక్రమంగా చెల్లించాలన్నారు. రుణాలు మంజూరు, తిరిగి వసూళ్లు సంఘమిత్రలు బాధ్యతగా తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏపీయం గంగాధర్, స్త్రీ నిధి మేనేజర్ భవాని తదితరులు పాల్గొన్నారు.

మత్తులో పడితే జీవితం నాశనం



మాట్లాడుతున్న వైద్యులు సనాఆయిషా

నిమ్మనపల్లె : యువత మత్తులో పడి జీవితాలను నాశనం చేసుకోవద్దని వాల్మీకిపురం సీహెచ్‌సీ డాక్టర్.కే.సనాఆయిషా అన్నారు. గురువారం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ రాధాకృష్ణ ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యంగా యుక్తవయస్సులో విద్యార్థులు డ్రగ్స్ లేదా మద్యం వినియోగానికి అలవాటు పడితే ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా భవిష్యత్తు లేకుండా పోతుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఇందుశేఖర్, ఏఎస్‌ఐ ఎస్.ఏ.కే.జలీల్ తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరంగా ఉండాలి

గుర్రంకొండ : విద్యార్థులు దురలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ దిలీప్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక తెలుగు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థిని, విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో విద్యార్థులు దుర అలవాట్లకు విద్యార్థులకు తొందరగా అలవాటు పడుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జమీర్, వెంకటరమణారెడ్డి, రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది బాధ్యతతో పని చేయాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో నాగరాజు

కేవీపల్లె : గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతతో పని చేయాలని మదనపల్లె డీఎల్‌పీవో నాగరాజ అన్నారు. గురువారం కేవీపల్లె గ్రామ సచివాలయాన్ని ఆయన సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహణపై అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం, ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. గ్రామ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఈవోపీఆర్డీ ఎస్ఎ.గఫూర్, పంచాయతీ కార్యదర్శులు దేవేంద్ర, నాగభూషణం పాల్గొన్నారు.

సచివాలయం, మీసేవ కేంద్రం తనిఖీ

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె-1, 2 సచివాలయాలు, మీ-సేవ కేంద్రాన్ని గురువారం డీఎల్‌డీఓ లక్ష్మీపతి, ఎంపీడీఓ శేషగిరిరావుతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సచివాలయంలో అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష నమోదుపై ఆరా తీశారు. అనంతరం మదనపల్లె రోడ్డులోని మీ-సేవ కేంద్రాన్ని తనిఖీ చేశారు. జారీచేసిన సర్టిఫికెట్ల వివరాలను పరిశీలించారు. అధిక రుసుం ప్రజల వద్ద నుంచి వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.

చర్చి నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, పాస్టర్లు

కేవీపల్లె : మండలంలోని ఎంవీపల్లె పంచాయతీ గుండ్రేవారిపల్లెలో ఇక్తూస్ ప్రార్థనా మందిరం (చర్చి) నిర్మాణానికి భూమి పూజ చేశారు. గురువారం పలువురు పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భూమిపూజ చేపట్టారు. స్థానిక పాస్టర్ విజయకుమార్ మాట్లాడుతూ చర్చికి కొత్త భవనం నిర్మాణానికి భూమి పూజ చేపట్టడం జరిగిందని తెలిపారు. చర్చి అభివృద్ధికి అందరి సహకారం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల యూత్ కన్వీనర్ గజ్జెల శీన్‌రెడ్డి, సర్పంచ్ రత్నాకర్‌రెడ్డి, ఎంపీటీసీ ఈశ్వరయ్య, నాయకులు రెడ్డెప్పరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, రమేష్, నాగ, పాస్టర్లు సీహెచ్. రాజు, అభిషేక్, బాబు, నిరంజన్, దివ్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్‌కు బానిసలు కావద్దు

మదనపల్లె సిటీ : సెల్‌ఫోన్‌కు బానిసలు కావద్దని వెలుగు పాఠశాల కన్వీనర్ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక వెలుగు పాఠశాలలో గురువారం ప్రపంచ దృష్టి దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కన్నులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. కంటిచూపుతో బాధపడుతున్న వెలుగు చిన్నారుల ప్రతిభను కొనియాడారు. అనంతరం అంధ విద్యార్థులతో కలిసి గ్రూప్ ఫొటో తీసుకున్నారు. కార్యక్రమంలో వెలుగు ప్రిన్సిపాల్ లీనా కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

కలికిరి : కలికిరి పంచాయతీ కలికిరి-2 గ్రామ సచివాలయం పరిధిలో శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్‌రెడ్డి తెలిపారు. మల్‌రెడ్డి నగర్, బీడీ కాలని, భారత్ గ్యాస్ వీధి, వినాయక నగర్, మంగమ్మ కాలని, స్టేట్ బ్యాంక్ వీధి ప్రాంతాల్లో జరుగు కార్యక్రమానికి నాయకులు హాజరవ్వాలని కోరారు.

21న లోక్ అదాలత్

మదనపల్లె : హైకోర్టు ఆదేశానుసారం అక్టోబర్ 21న మదనపల్లె కోర్టు సముదాయంలో స్పెషల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు రెండో అదనపు జిల్లా జడ్జి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. లోక్ అదాలత్‌లో రెవెన్యూ, మోటార్ యాక్సిడెంటల్ కేసులు రాజీ చేస్తారని, మోటార్ యాక్సిడెంట్ కేసుల్లో క్లెయిమ్ చేసిన మొత్తం డబ్బు చెల్లించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

సింగిల్ విండోలో రుణాలు

తంబళ్లపల్లె: సింగిల్ విండోలో రైతులకు పంట రుణాలు, బంగారుపై రుణాలు ఇస్తున్నట్లు సింగిల్ విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, ఈఈవో భాస్కర్ రెడ్డిలు తెలిపారు. ఇప్పటి వరకు రూ.కోటి వరకు బంగారు తాకట్టుపై రుణం, మరో రూ.కోటి వరకు పంట రుణాలు అందజేశామని వారు పేర్కొన్నారు. పావలా వడ్డీకి పంట రుణం, రూ.75 పైసలతో బ్యాంకు రుణాలు ఇస్తోందన్నారు.

జూదరుల అరెస్ట్

పెద్దమండ్యం : మండలంలోని కోటకాడపల్లె సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయుడు తెలిపారు. వారి నుంచి రూ.16,400 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.